నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 1 మే 2024 | SURYAPET

సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా గోవర్ధన్‌రెడ్డి

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్.గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేట లీగల్, ఏప్రిల్ 30 : సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన జి.రాజగోపాల్ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ కాగా, ఆయన స్థానంలో గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. మేడ్చల్ జిల్లాకు చెందిన గోవర్ధన్ రెడ్డి 1994లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2013లో జిల్లా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మొదటిసారిగా నిజామాబాద్ జిల్లా బోధన్‌లో అదనపు జిల్లా న్యాయమూర్తిగా పని చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత నిజామాబాద్ జిల్లా న్యాయమూర్తిగా ప్రమోషన్ పొందారు. జిల్లా న్యాయమూర్తుల బదిలీల్లో భాగంగా గోవర్ధన్‌రెడ్డిని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు అందుకున్న ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

అభ్యుదయ కవి శ్రీశ్రీ

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 30 : సమాజంలో దౌర్జన్యాలను ఆనాడే ఘాటుగా విమర్శించిన అభ్యుదయ కవి శ్రీశ్రీ అని పలువురు కవులు, రచయితలు అన్నారు. ఆయన రచనలు నేటికీ ఆదర్శనీయమని కొనియాడారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం కార్యాలయంలో భానుపురి సాహితీ వేదిక, శ్రీశ్రీ కళావేదిక అధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. వచన కవిత్వంలో తిరుగులేని మహాకవిగా శ్రీశ్రీ మహా ప్రస్థానాన్ని మనకందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, భానుపురి సాహితీ వేదిక గౌరవ సలహాదారులు హమీద్‌ఖాన్, చిర్ర శ్రీనాథ్, మారోజు ద్రోణాచారి, కాసోజు పాండు, కొసనోజు సైదాచారి పాల్గొన్నారు.

శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

కేసీఆర్ పర్యటనతో వార్ వన్ సైడ్

- కాంగ్రెస్, బీజేపీ రెండూ తోడు దొంగలే..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట మున్సిపాలిటీ, సోలిపేటలో ఇంటింటి ప్రచారం
- బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించాలి


సూర్యాపేట రూరల్ : సోలిపేటలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి గుంటండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)/ సూర్యాపేట రూరల్ : జిల్లాలో ఆరు రోజుల కేసీఆర్ పర్యటనతో లోక్‌సభ ఎన్నికల్లో వార్ వన్ సైడే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం సూర్యాపేట మండలం సోలిపేట, సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పలు వార్డుల్లో గడపగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహిళలు హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ హవా మళ్లీ మొదలైందని, కేసీఆర్ వస్తేనే తమకు శ్రీరామ రక్ష అని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో కక్షపూరిత వైఖరి, నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలే తమకు వివరిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరూ తోడు దొంగలేనని, వారి సిద్ధాంతాలను, రాద్ధాంతాలను ప్రజలు గమనించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నట్లు వెల్లడించారు. బీజేపీ ముస్లిం రిజర్వేషన్ల రద్దు పేరుతో మొత్తం రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. బీజేపీ వ్యాపారస్తుల పార్టీ అన్న ఆయన.. ప్రజలను మరింత బీదవాళ్లను చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ పని చేస్తున్నదని విమర్శించారు. ప్రజల్లో సెంటిమెంట్ రగిల్చి పబ్బం గడుపుకొనేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలను ఆకలితో ఉంచాలనే దుర్మార్గమైన సిద్ధాంతం కోసం బీజేపీ పని చేస్తున్నదని మండిపడ్డారు. నోటీసుల డ్రామాతో ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం బయటపడిందన్నారు. బీజేపీకి రేవంత్‌తో ఒప్పందం లేకుంటే కవితను అరెస్ట్ చేసినట్లు సీఎంను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మీడియాలో ప్రచారం కోసం ప్రజలను మోసగించేందుకే రేవంత్ నోటీసుల డ్రామా అని దుయ్యబట్టారు. మారిన పరిస్థితుల్లో రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోనున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర పరిస్థితుల్లో మార్పు తథ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రచారంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, పార్టీ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, నాయకులు గోగిరెడ్డి వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవి, పరమేశ్ పాల్గొన్నారు.

కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నూతనకల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నూతనకల్, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో కష్టపడి పని చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, నాయకులు బత్తుల సాయిల్‌గౌడ్, బత్తుల విజయ్‌కుమార్, చూడి లింగారెడ్డి, బత్తుల విద్యాసాగర్, వీరమల్ల యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, వెంకన్న, లింగమల్లయ్య, బుచ్చయ్య, రాంరెడ్డి, పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

మద్దిరాల : బీఆర్ఎస్‌కు కొట్లాటలు కొత్తేమీ కాదని నిలబడి కలబడుదామని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ అధైర్య పడొద్దు అండగా ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన వాళ్లే పార్టీ మారుతున్నట్లు దుయ్యబట్టారు. పోయేవారిని పోనివ్వండి ఉన్నవారే కష్టపడి పనిచేస్తే నాయకులు అయ్యి రాజకీయ అవకాశాలను పార్టీ కల్పిస్తుందని తెలిపారు. ఈ నెల 3న మండల కేంద్రంలో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు ఎస్ఏ రజాక్, వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సూరినేని నర్సింహారావు, జిల్లా నాయకులు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, రావుల వెంకన్న, వడ్డాణం మధుసూదన్, లావుడ్య వెంకన్న, దామెర్ల వెంకన్న, నాగెల్లి శ్రవణ్‌కుమార్, మల్లు కలింగారెడ్డి, బొబ్బిలి ఉప్పలయ్య, బద్దం సంజీవరెడ్డి, అక్కిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, భూక్య వీరన్న పాల్గొన్నారు.

పది ఫలితాల్లో పురోగమనం

- 96.11 శాతం ఫలితాలతో రాష్ట్రంలో నల్లగొండకు 9వ స్థానం
- సత్తాచాటిన గురుకుల, కేజీబీవీ విద్యార్థులు
- 101 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు

9.8సాధించిన కేజీబీవీ విద్యార్థినులు హారిక, శృతి

రామగిరి, ఏప్రిల్ 30 : పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో నల్లగొండ జిల్లా పురోగమించింది. 96.11శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం 17వ స్థానం దక్కింది. మార్చి 18నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 19,263 మంది విద్యార్థులు హాజరు కాగా, 18,513 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 101 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. బాలుర కంటే బాలికలు ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించారు. 10జీపీఏ సాధించిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయా స్కూల్ అధ్యాపకులు అభినందించారు.

గతం కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం

పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో ఈ పర్యాయం ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత సంవత్సరం పరీక్షలకు 19,236 (బాలురు 9,886, బాలికలు 9,350) మంది హాజరు కాగా, 17,234 మంది (బాలురు 8,772, బాలికలు 8,462) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 89.59 శాతంతో 17వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది 19,263 (బాలురు 10,099, బాలికలు 9,164) మంది హాజరు కాగా, 18,513 మంది (బాలురు 9,615, బాలికలు 8,898) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 96.11 శాతం ఉత్తీర్ణతతో జిల్లా 9వ స్థానంలో నిలిచింది. ఇందులో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు అధికంగా ఉండటం విశేషం.

15 రోజుల్లోగా రీ వెరిఫికేషన్‌కు అవకాశం

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఫలితాలు విడుదల చేసిన నాటి నుంచి 15రోజుల వరకు అవకాశం కల్పించారు. రీ వెరిఫికేషన్ కంసప్లయి ఆఫ్ ఫోటో కాపీ ఆప్ వాల్యూడ్ (మూల్యాంకనం చేసి జవాబు పత్రం) ఆన్సర్ బుక్ కోసం ఒక్క సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలని డీఈఓ బి.భిక్షపతి, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు. ట్రెజరీ చలానా ద్వారా చెల్లించాలి. దానికి హాల్ టికెట్ జతపరిచి దరఖాస్తును సంబంధిత ప్రధానోపాధ్యాయులతో సంతకం చేయించి డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో అందజేయాలి.

అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 16వరకు అవకాశం

పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు జూన్‌లో జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు మే 16లోగా ఫీజు చెల్లించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. రూ.50 అపరాధ రుసుంతో పరీక్షలు జరిగే రెండు రోజుల ముందు వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉన్నది. అడ్వాన్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3నుంచి 13వరకు జరుగనున్నాయి.

10జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- నారగోని ప్రవళిక (పెరిక కొండారం జడ్పీ హైస్కూల్, శాలిగౌరారం మండలం)
- ఎన్.సాయిగణేశ్ (పెరిక కొండారం జడ్పీ హైస్కూల్, శాలిగౌరారం మండలం)
- పొట్టబత్తిని ఫణిశ్రీ (నేరడ జడ్పీ హైస్కూల్, చిట్యాల మండలం)
- కె.కీర్తన (నేరడ జడ్పీ హైస్కూల్, చిట్యాల)
- సయ్యద్ సానీయా (బకల్‌వాడీ జడ్పీ హైస్కూల్, మిర్యాలగూడ)
- ఇ.అక్షర (బాలికల జడ్పీ హైస్కూల్, మిర్యాలగూడ)
- రమావత్ సర్దార్ (తిరుమలగిరి జడ్పీ హైస్కూల్, తిరుమలగిరి సాగర్ మండలం)
- ఆంగోతు నందు (తిరుమలగిరి జడ్పీ హైస్కూల్, తిరుమలగిరి సాగర్ మండలం)
- గోగుల మనీష (ఆళ్లగడప జడ్పీ హైస్కూల్, మిర్యాలగూడ మండలం)
- రమావత్ తారక రూప (హాలియా జడ్పీ హైస్కూల్, అనుముల మండలం)
- పిట్టల రమ్యశ్రీ (హాలియా జడ్పీ హైస్కూల్, అనుముల మండలం)
- కుంచం శృతి (మారేపల్లి జడ్పీ హైస్కూల్, అనుముల మండలం)
- తాటికొండ శివ (మోడల్ స్కూల్, కనగల్)

నల్లగొండ జిల్లాలో మేనేజ్‌మెంట్ స్కూళ్ల వారీగా ఫలితాలు

మేనేజ్‌మెంట్	ఉత్తీర్ణత శాతం	పాఠశాలలు	వంద శాతం పాఠశాలలు
జిల్లా పరిషత్	92.96	209	84
ప్రభుత్వ	86	20	03
కేజీబీవీ	96.24	27	10
మోడల్	97.04	17	04
ఎయిడెడ్	96.97	04	01
ప్రైవేట్	98.8	155	97
ఆశ్రమ	97.18	02	01
బీసీ వెల్ఫేర్	99.91	14	13
మైనార్టీ	98.51	06	04
సోషల్ వెల్ఫేర్	99.37	11	08
ట్రైబల్ వెల్ఫేర్	99.37	08	06
మొత్తం	96.11	473	231

రాష్ట్ర స్థాయిలో 6వ స్థానంలో సూర్యాపేట జిల్లా

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సూర్యాపేట జిల్లా 96.91 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 6వ స్థానంలో నిలిచింది. బాలికలు 97.72 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 96.16 శాతం మంది పాస అయ్యారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 11,910 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 11,542 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 6,198 మంది బాలురు పరీక్షలు రాయగా.. 5,960 మంది ఉత్తీర్ణులయ్యారు. 5,712 మంది బాలికలకు గాను 5,582 మంది పాస్ అయ్యారు.

రీ కౌంటింగ్ చేయదలచిన విద్యార్థులు సబ్జెక్టుకు రూ.500 చొప్పున చలానా ద్వారా చెల్లించి 15 రోజుల్లోపు ప్రభుత్వ పరీక్షల విభాగంలో అందించాలని జిల్లా అధికారులు సూచించారు.

మే 2నుంచి పోలింగ్ సిబ్బందికి శిక్షణ

- కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 30 : నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నికల విధులకు నియమించబడిన పీఓ, ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బందికి మే 2 నుంచి 4వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను పోలింగ్ సిబ్బంది రెండో విడుత ర్యాండమైజేషన్‌ను ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేయడంతోపాటు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు వారిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను మే ఒకటి నాటికి సంబంధిత అధికారులు పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండో విడుత శిక్షణ కార్యక్రమాలు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు రెండు విడుతల్లో వారికి కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు పీఓ, ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఎంఈఓలు ఎన్నికల విధులకు నియమించబడిన సిబ్బందికి ఉత్తర్వులను అందజేసే ఏర్పాట్లు చేయాలని, ప్రత్యేకించి విద్యాశాఖకు సంబంధించిన ఉద్యోగులకు ఎంఈఓ ద్వారా, ఇతర ఉద్యోగులకు ఎంపీడీఓ ద్వారా అందజేయాలని ఆదేశించారు.

జిల్లా స్థాయి అధికారులు వారి పరిధిలో పనిచేసే మండల, డివిజన్ స్థాయి అధికారులకు, ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులకు తక్షణమే ఉత్తర్వులు జారీ చేసి శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 2, 3 తేదీల్లో పీఓ, ఏపీఓలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, 4వ తేదీ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు ఉంటాయని ఆమె తెలిపారు.

యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు కోసం రోడ్డెక్కిన రైతన్న

- యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- రోడ్డుపై ట్రాక్టర్లు పెట్టి ధాన్యం కింద పోసి నిరసన

వలిగొండ, ఏప్రిల్ 30 : ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అధికారులు, మిల్లర్లు కలిసి కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలిచిపోవడంతో కడుపు మండిన వలిగొండ మండలంలోని సంగెం, వర్కట్‌పల్లి గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా రైతులు ట్రాక్టర్లలో ధాన్యం తీసుకొచ్చి కలెక్టర్ కార్యాలయం ఎదుట కింద పోసి ఆందోళన చేపట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా కదంతొక్కి వెంటనే ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లను నిలిపివేశారని, కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలంటే రైతుల నుంచి లారీ యజమానులు బస్తాకు రూ.5 అదనంగా డిమాండ్ చేస్తున్నారని వాపోయారు.

మిల్లర్లు తాలు, తరుగు పేరుతో 5 కిలోలు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ-గ్రేడ్ ధాన్యాన్ని మిల్లుల వద్దకు రాగానే బీ-గ్రేడ్ ధాన్యంగా మారుస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్, అధికారులు బయటకు వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఇదే సమయంలో పోలీసులు రంగప్రవేశం చేయడంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు వెనక్కి తగ్గలేదు. దీంతో రెండు వైపులా భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అనంతరం పలువురు రైతులు కలెక్టరేట్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు.

అధికారులు, మిల్లర్లు కలిసి ముంచుతుండ్రు

ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు, మిల్లర్లు కలిసి రైతులను నిండా ముంచుతుండ్రు. మార్కెట్లో వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. లారీ యజమానులు బస్తాకు 5 రూపాయలు డిమాండ్ చేస్తుండ్రు. మిల్లర్ల చేతిలో అధికారులు కీలుబొమ్మలుగా మారిండ్రు. ప్రభుత్వానికి, అధికారులకు రైతుల గోస పట్టడం లేదు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి. లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

–సోలిపురం జనార్దన్‌రెడ్డి, రైతు, వర్కట్‌పల్లి, వలిగొండ మండలం

వడ్లు కొనక వారమైంది..

లారీలు రాక వారం రోజులుగా మార్కెట్లో ధాన్యం కొనుగోళ్లు జరుగలేదు. లారీ యజమానులు బస్తాకు 5 రూపాయలు అడుగుతుండ్రు. అధికారులు మొక్కుబడిగా వచ్చిపోతుండ్రు గానీ ధాన్యం మాత్రం కొంటలేరు. మిల్లర్ల చేతిలో అధికారులు కీలుబొమ్మగా మారారు. ధాన్యం లోడ్లతో వెళ్లిన లారీలను మిల్లుల వద్ద ఏరోజుకు ఆరోజు ఖాళీ చేయించేలా చర్యలు చేపట్టాలె. అధికారులను అడిగితే మిల్లర్ల మీద, మిల్లర్లను అడిగితే అధికారుల మీద నెపం వేస్తూ కాలయాపన చేస్తుండ్రు.

–జక్కల వెంకటేశ్, రైతు, సంగెం, వలిగొండ మండలం

నల్లగొండలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రోడ్డు

భగ్గుమన్న భానుడు

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
మాడ్గులపల్లిలో 46.2 డిగ్రీలు నమోదు
11 మండలాల్లో రికార్డు స్థాయిలో 45 డిగ్రీలకు పైనే..

నల్లగొండ, ఏప్రిల్ 30 :నల్లగొండ జిల్లా నిప్పుల కొలిమిలా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. నిన్న మొన్నటి వరకు 43 డిగ్రీల మధ్య దోబూచులాడిన భానుడు మంగళవారం అంతకు మించిన మార్కును దాటి 46.2 డిగ్రీలకు చేరాడు. అదీ ఇటీవల అత్యధిక గరిష్ఠ స్థాయిలో నమోదవుతున్న మాడ్గులపల్లిలో మరోసారి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం మాడ్గులపల్లిలో అత్యధికంగా 46.2 డిగ్రీలు నమోదైంది. అదేవిధంగా నాంపల్లిలో 45.9 డిగ్రీలు, చందంపేటలో 45.8, దామరచర్ల, వేములపల్లిలో 45.7, అనుములలో 45.6, అడవిదేవులపల్లి, మిర్యాలగూడలో 45.2, గట్టుప్పల్, త్రిపురారంలో 45.1, పెద్దవూరలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తంగా 11 మండలాల్లో 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. 15 మండలాల్లో 43 డిగ్రీలకు పైగా, మిగతా మండలాల్లో 41 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 34 నుంచి 38 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి. దీంతోపాటు ఎండ వేడిమి, ఉక్కపోత, వడగాడ్పుల కారణంగా జనం అల్లాడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో భయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

నల్లగొండలో ఎండకు తాళలేక స్కార్ఫ్‌లతో వెళ్తున్న మహిళలు

భువనగిరి ఓటర్లు @18,08,585

- తేలిన పార్లమెంట్ ఓటర్ల వివరాలు
- పురుషుల కంటే స్వల్పంగా మహిళలు అధికం
- సగం మందికి పైగా 40ఏండ్లలోపు వారే
- వందేండ్ల పైబడినోళ్లు 180 మంది
- ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా ఓటర్లు



యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల లెక్క తేలింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంత మంది ఓటర్లు అనే వివరాలను రిటర్నింగ్ అధికారి హన్మంతు కె.జెండగే వెల్లడించారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,08,585 ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 8,98,416మంది పురుషులు, 9,10,090 మంది స్త్రీలు, 79 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 3,39,341మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత మునుగోడులో 2,57,557, భువనగిరిలో 2,20,596, నకిరేకల్‌లో 2,53,785, తుంగతుర్తిలో 2,59,265, ఆలేరులో 2,35,270, జనగాంలో 2,42,771 ఓటర్లు ఉన్నారు.

40 ఏండ్లలోపు 9,29,325 ఓటర్లు

పార్లమెంట్ పరిధిలోని మొత్తం ఓటర్లలో సగం మందికి పైగా యువ ఓటర్లే ఉన్నారు. 40 ఏండ్లలోపు 9,29,325 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇక 40 నుంచి 99 ఏండ్లలోపు 8,79,090 మంది ఓటర్లు ఉన్నారు. ఇక వందేండ్లకు పైగా 180 మంది ఉన్నారు. ఇందులో వంద నుంచి 109 ఏండ్ల మధ్య 143 మంది, 110 నుంచి 119 మధ్య 14 మంది, 120కి పైగా 23 మంది వృద్ధులు ఉన్నారు. వృద్ధుల ఓటు నమోదు కోసం ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

వయసు వారీగా ఓటర్ల వివరాలు..

వయసు	ఓటర్లు
18-19	61,813
20-29	3,87,893
30-39	4,79,619
40-49	3,52,333
50-59	2,50,391
60-69	1,62,402
70-79	87,809
80-89	23,164
90-99	2,991
100-109	143
110-119	14
120+	23
మొత్తం	18,08,585